గ్రంథాలయాలకు పూర్వవైభవం ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకు వస్తామన్న విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ప్రకటన పట్ల జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జివిఆర్ఎస్‌హెచ్‌కె.వర్మ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 175 నియోజకవర్గాల్లో గ్రంథాలయాల ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ చేసిన ప్రకటనను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వరల్డ్ క్లాస్ సెంట్రల్ లైబ్రరీ కోసం రూ.150 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామని, ఎపిలో 24 నెలల్లో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ పూర్తి చేస్తామని ఆయన తెలిపారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం త్వరితగతిన గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. మంత్రి లోకేష్‌కు తమ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

విఆర్ఎల వెట్టి చాకిరి

- అరకొర జీతాలు..
- ఉద్యోగోన్నతులు కరువు
- కారుణ్య నియామకాలు లేవు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నిరసన తెలుపుతున్న విఆర్ఎలు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గ్రామాల్లో భూమి పన్నుల వసూళ్ల నుంచి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలు చేయడం, గ్రామ సభలు ఏర్పాట్లు చేయడం, హత్యలు జరిగినా, ప్రమాదాలు సంభవించినా గ్రామ రెవెన్యూ సహాయకుల పాత్ర చాలా కీలకం. కొత్తగా విస్తరిస్తున్న జాతీయ రహదారుల సర్వే రాళ్ల కొలతలు, రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కార్యక్రమాల ద్వారా వీరు వెట్టి చాకిరీ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం విఆర్ఎల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా ఆందోళనా బాట పట్టారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అన్ని గ్రామాల్లో 2,300 మంది విఆర్ఎలు విధులు నిర్వహిస్తున్నారు. సుమారు మరో 300 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయించడంలో, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడంలోనే వీరే ప్రధాన పాత్ర వహిస్తారు. కొన్ని చోట్ల అధికారుల సొంత పనులు కూడా చేయాల్సి వస్తుంది. ఉదయం 8 గంటల నుంచి ఒక్కోసారి రాత్రి 12 గంటల వరకూ పనులు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అయితే ఇన్ని పనులు చేస్తున్న విఆర్ఎలకు కనీస వేతనాలు అమలు కావడం లేదు.

పే స్కేల్ కోసం ఎదురుచూపులు

కేవలం గౌరవ వేతనంపై ఆధారపడి విఆర్ఎలు కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.3 వేల గౌరవ వేతనం ఉండేది. ఆయన దానిని రూ.6,500కి పెంచారు. ఆ తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10,500 చేశారు. డి.ఎ రూ.100 నుంచి రూ.300కి పెంచారు. గత పాలనలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీరి వేతనాలను పెంచకపోగా డిఎలను కుదించారు. 18 నెలల కాలానికి తిరిగి రూ.10,500 వీరితో ప్రభుత్వానికి కల్పించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తమకి పే స్కేలను అమలు చేయాలని, పూర్తి కాలపు సిబ్బందిగా నియమించాలని, రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలనే తదితర డిమాండ్లు విఆర్ఎల నుంచి వినిపిస్తున్నాయి. అంటెండర్, వాచ్‌మెన్, ఉద్యోగోన్నతుల కోటాను 20 శాతం నుంచి 30 శాతంకు పెంచుతామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. మట్టి ఖర్చులను రూ.15 వేలకు పెంపుదల చేస్తామని హామీలు గుప్పించింది. పార్ట్ టైమ్ గౌరవవేతనంతో పనిచేస్తున్న విఆర్ఎలు పని భారంతో తీవ్రంగా సతమతం అవుతున్నారు. విధుల నిర్వహణలో దూర గ్రామాలకు వెళ్లి రావాల్సి ఉంటుంది. అనారోగ్యం, వృద్ధాప్యంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దశల వారీ ఆందోళన

డిమాండ్ల సాధన కోసం విఆర్ఎలు దశల వారీగా ఆందోళన సాగిస్తున్నారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో ఈ నెల 18, 19 తేదీలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. 20వ తేదీన డివిజనల్ రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా చేసి ఆర్‌డిఒలకు వినతిపత్రాలు అందించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అధికారులకు మరోసారి వినతిపత్రాన్ని అందజేశారు.

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

అనేక ఏళ్లగా రెవెన్యూ కార్యాలయాలు, గ్రామాల్లో సేవలు అందిస్తున్నాం. గత ప్రభుత్వాలు అరకొర వేతనాలు పెంచినప్పటికీ ఇతర సమస్యలు ఏవి పరిష్కరించ లేదు. గతంలో మాకు చంద్రబాబు సమయంలోనే గౌరవ వేతనాలు పెంచారు. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాబట్టి కనీస వేతనాలు ఇవ్వాలి.

-వి.సత్యనారాయణ, విఆర్ఎ, కాజులూరు

ధరలతో ఇబ్బందులు

ఇప్పటికే పెరుగుతున్న ధరలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెట్టి చాకిరీ చేస్తున్నా పనికి తగ్గ ఫలితం దక్కడం లేదు. కనీస వేతనాలు ఇస్తామంటున్న ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఇప్పటికైనా వేతనాలను పెంచాలి.

-అప్పల స్వామి, విఆర్ఎ, పిఠాపురం

నామినీలను నియమించాలి

తక్షణమే పేస్కేల్ అమలు చేయడంతో పాటు నామినీలను విఆర్ఎలుగా నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు చేపట్టాలి. ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించాలి. లేకపోతే ఉద్యమ బాట తప్పదు.

-తాతపూడి రాజు, విఆర్ఎ, కాజులూరు

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు పలివెల వీరబాబు

'8 గంటల పని విధానం కొనసాగించాలి'

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివేల వీరబాబు, నాయకులు మేడిశెట్టి వెంకట రమణ డిమాండ్ చేశారు. సోమవారం జిజిహెచ్ మెస్ వర్కర్ల యూనియన్ 9వ మహాసభ యూనియన్ అధ్యక్షులు వై.శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెస్ వర్కర్లు 9వ మహాసభ జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. మహాసభ స్ఫూర్తితో నూతన వేతన ఒప్పందం కొరకు పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని మార్పు చేసి 12 నుంచి 13 గంటలపాటు కార్మికుడిని శ్రమను దోచుకునేలా అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని అన్నారు. వందల సంవత్సరాల క్రితం పనిగంటలు కోసం ఎందరో కార్మికులు ప్రాణ త్యాగాలు చేస్తే ఈ 8 గంటల పని విధానం వచ్చిందని, కానీ నేటి కూటమి ప్రభుత్వం 8 గంటలను తీసివేయడం దారుణమన్నారు. మహిళా కార్మికులను రాత్రిపూట డ్యూటీలు చేయవచ్చని అనుమతించడం అంటే మహిళలకు భద్రత లేకుండా మరిన్ని నేరాలు ఘోరాలు జరగడానికి ప్రభుత్వమే తోడ్పడుతుందన్నారు. రాష్ట్రంలో నెంబర్ వన్ కార్మికుడనని చెప్పుకునే చంద్రబాబు మరి కార్మికులకు పనిగంటలు ఎలా పెంచారని ప్రశ్నించారు. మరోపక్క పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు మాత్రం పెంచడం లేదని, తక్షణమే వేతనాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పనిగంటలు తగ్గించి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని అన్నారు. అనంతరం మెస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికపై సభ్యులు చర్చించారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన గౌరవ అధ్యక్షులుగా మేడిశెట్టి వెంకటరమణ, అధ్యక్షులుగా వై.శంకర్, కార్యదర్శిగా అనపర్తి ఏడుకొండలు, కోశాధికారిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా శ్రీను, సహాయ కార్యదర్శిగా వీరబాబు, మరో ఐదుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏచూరి శ్రీను, దుర్గమ్మ, భద్రం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యశ్రీనివాస్‌కు అవార్డు

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన చోడపునీడి సూర్యశ్రీనివాస్ టైం బిజినెస్ అవార్డు అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన టైమ్ బిజినెస్ అవార్డ్స్-2025 ప్రదానోత్సవంలో ఆయన ప్రముఖ నటి రాశి ఖన్నా చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. లగ్జరీ వెడ్డింగ్ ఫోటోగ్రఫీలో క్రియేటివ్ ఎక్సలెన్స్, ఆధునిక దృక్కోణం, డెస్టినేషన్ వెడ్డింగ్స్ కవరేజ్‌లో చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ ఈ గౌరవం లభించింది. వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో తనదైన ముద్ర వేసి ఈ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని సూర్యశ్రీనివాస్ అన్నారు.

అవార్డును తీసుకుంటున్న సూర్యప్రకాష్

కాలుష్య కారక పరిశ్రమలను తొలగించాలంటూ వినతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార నాయకులు

మత్స్యసంపదను నాశనం చేస్తున్న పరిశ్రమలను తక్షణమే తొలగించాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. సోమవారం మండలానికి చెందిన మత్స్యకారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరబిందో ఫ్యాక్టరీతోపాటు, ఇతర పరిశ్రమలు సముద్రంలోకి కాలుష్యంతో కూడిన రసాయనిక వ్యర్థాలను విడుదల చేస్తున్నాయని, దీనివల్ల మత్స్య సంపద నశించిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసిపి పాలన నుంచి నేటి పాలకుల వరకూ మత్స్యకారుల ఇబ్బందులపై వినతిపత్రాలు అందించామని, అయినా పాలకులు స్పందించడం లేదన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పోలీసులు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మత్స్యకారులు చేపట్టే ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరారు. రింగ్ రోడ్డు సమీపంలో నాలుగు రోడ్లు మూసివేసి రోడ్డులో ధర్నాకు దిగుతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరడ రాజు, జనసేన నాయకులు ఉమ్మిడి జాను, గంటా విజయ్‌కుమార్, సర్పంచ్ నక్కా మణికంఠ, చోడిపల్లి ప్రసాద్, మత్స్యకారులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారం కోరుతూ న్యాయవాదుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఎ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. స్థానిక బార్ అసోసియేషన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ కలెక్టరేట్ వరకూ సాగింది. ధర్నా అనంతరం జెసి రాహుల్‌మీనాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డెత్ బెన్ఫిట్ ఫండ్ కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఇండియన్స్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఎ) ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్ బార్ కౌన్సిల్ విఫలమయ్యాయని ఆరోపించారు. అర్హులైన న్యాయవాదులకు రూ.10లక్షలు ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు చొప్పున ఐదేళ్ళపాటు స్టైఫండ్ తక్షణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎల్ఎ జిల్లా ఉపాధ్యక్షులు కోలా శ్రీహరిరావు, జిల్లా మహిళా కన్వీనర్ డాక్టర్ వై.వసంతకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, ఐఎల్ఎ నాయకులు పిల్లి శ్రీనివాస్‌గౌడ్, మంగం శివరామకృష్ణ, జెవి.రమణ, ఎం.సరోజిని, బండి నరేంద్ర, నాగభూషణం, పంతగడ అప్పారావు, బి.వి.రమణ, చక్రవర్తి, అశోక్ పాల్గొన్నారు.

ఆదిత్యలో జెఎన్ఎఐపై వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థికి బహుమతిని అందిస్తున్న అతిథులు

ఆదిత్య విశ్వవిద్యాలయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ మరియు డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జెఎన్ఎఐపై 6 రోజుల వర్క్‌షాపు ప్రారంభం అయింది. సోమవారం ఆదిత్య కళాశాలలో జరిగిన ఈ వర్క్‌షాపులో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఈ నెల 27వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా కంటెంట్ క్రియేషన్స్‌లో ఉపయోగించే ఆధునిక సాంకేతికలపై అవగాహన కల్పించనున్నట్లు తలెఇపారు. ప్రాజెక్ట్ ఆలోచనల రూపకల్పన, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అనువర్తనాల అభివృద్ధి పద్ధతులను వివరిస్తామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ వృత్తి అవకాశాలు మరింత మెరుగు పరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్లు ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, ఇగ్నైట్ ఎంబెడెడ్ సిస్టమ్స్ సిఇఒ దిర్సినాల వీరాంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యవంతమైన జీవితం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అవగాహన కార్యక్రమంలో సర్పంచ్, ఇతరులు

ఆరు నెలల శిశువు నుంచి వృద్ధుల వరకు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చునని ఎంపిడిఒ సిహెచ్.రవి కుమార్‌వర్మ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రవరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థూలకాయ నివారణ, చెక్కెర, వంటనూనె వినియోగంపై నియంత్రణ ఉండాలన్నారు. సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు విరివిగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిశెట్టి అప్పలరాజు, కూటమి నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు, గంగిరెడ్ల మణికంఠ, గ్రామ కార్యదర్శి రామరాజువర్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.చక్రవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారంపై దృష్టి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టి సారించాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ కోరారు. సోమవారం శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించిన అంశాలను స్థానిక మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. నియోజకవర్గంలో 58 గిరిజన గ్రామాలు ఉన్నాయని, అవి ఇటు మైదానం, అటు ఏజెన్సీ పరిధిలో లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. విద్యా, వైద్య సౌకర్యాలు, తాగునీరు, రహదారులు, కుల ధ్రువీకరణ పత్రాలు వంటి సదుపాయాలు కలగక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైసిపి పాలనలో తప్పుడు తీర్మానాలు చేసి గిరిజనుల హక్కులను హరించారన్నారు. 58 గిరిజన గ్రామాలను ఐటిడిఎ పరిధిలోకి చేర్చాలని కోరారు. పెద్దమల్లాపురం కేంద్రంగా ఒక కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గూడు కట్టక రైతుల ఆందోళన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పీడీకి వినతిపత్రం ఇస్తున్న పట్టు రైతులు

పట్టు పురుగు గూడు కట్టకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో పీడీ పి.వేణుగోపాలరావుకు చేబ్రోలు పట్టు రైతులు ఉలవకాయల రాంబాబు, ఒరుగంటి శివ ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుపురుగులు గూడు కట్టడం లేదని అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంట చేతికొస్తే ఎకరానికి లక్ష రూపాయలు వచ్చేదని, ఈ ఏడాది రెండు పంటలే చేతికొచ్చిందని, ప్రస్తుతం పురుగు గూడు కట్టడం లేదని, దీనివల్ల ఎకరానికి రూ.30 వేల వరకూ నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్బరీ తోట పక్కనే ఉన్న పత్తి, మిర్చి, బెండ పంటకు వినియోగిస్తున్న బయో మందుల వాడకం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు పరీక్షలు చేసి తగు నివారణా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టు రైతులు బేతా సూరిబాబు, ఉలవకాయల బాల, ఉలవకాయలు వీరబాబు పాల్గొన్నారు.

స్టేషన్ పరిశుభ్రత కోసం కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

స్టాల్‌ను పరిశీలిస్తున్న స్టేషన్ మేనేజర్

రైల్వే ప్రాంగణాలు, రైల్వేస్టేషన్‌ల పరిశుభ్రత కోసం కృషి చేయాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ కోరారు. సోమవారం స్వచ్ఛతాహీ సేవా మహోత్సవం కార్యక్రమంలో రైల్వే స్టేషన్లో వ్యర్థాలతో ఆకర్షణీయమైన కృత్యాలు, వస్తువుల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యర్థాల నుంచి వర్మి కంపోస్ట్ తయారీ, మొక్కల పెంపకం వంటి అంశాలను స్టేషన్ మేనేజర్ రమేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



కోకనాడ ఛాంబర్ అధ్యక్షునిగా 'గాదం'

ప్రజాశక్తి - కాకినాడ

నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న వ్యాపారులు

ది కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా గాదం చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో 9 మంది డైరెక్టర్లతో పాటు, మరో ముగ్గురు సలహాదారులతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షునిగా గాదం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా ఎవి.రంగారావు, డైరెక్టర్లుగా ఎకె.విశ్వనాథం, సి.నరసింహారావు, పివి.రావు, ఎంఎస్.కుమార్, దంటు భాస్కర్, శ్రీరామ్ భగవతి, కెవిఎస్.సీతారాం, సలహాదారులుగా పూర్వ ఛాంబర్ అధ్యక్షుడు వివి.రాఘవులు, ఎం.సత్యనారాయణ, ఎవి.చలం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైన గాదం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ఛాంబర్‌కు అధ్యక్షుడుగా ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఛైర్మన్‌గా పనిచేసిన వాళ్ల గౌరవాన్ని, ఛాంబర్ ప్రతిష్టను పెంచడమే లక్ష్యంగా నూతన కార్యవర్గంతో కలిసి పనిచేస్తానని చెప్పారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని పలువురు అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

గురజనాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఆయుర్వేద వైద్య శిబిరం జరుగుతుందన్నారు. బిపి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష్మీఐశ్వర్యను సత్కరిస్తున్న ఆదిత్య యాజమాన్య ప్రతినిధులు

సాంకేతిక నైపుణ్యత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

తరగతి గదిలో చెప్పే పాఠాలకు భిన్నంగా ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాన్ని సాధించాలని ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు సూచించారు. సోమవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో మైండ్ స్పార్క్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నాయుడు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులలో నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు బహుముఖ ప్రజ్ఞాశాలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రాక్టల్ ఐటీ కంపెనీ డేటా ఇంజనీర్ పి.లక్ష్మీ ఐశ్వర్య మాట్లాడుతూ ఐటి రంగంలో ఎంత పోటీ ఉంటుందో అందరికీ తెలుసని, ఈ పోటీకి నిలబడటానికి విద్యార్థులు సర్టిఫికేషన్లు, ప్రాజెక్టులు చేయడం, కోడింగ్ వంటి అంశాల్లో నైపుణ్యతను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎఐ డీన్ సిద్ధార్థరెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి విఎస్ఎన్.కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

అన్నం వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి మండలంలోని కాట్రావులపల్లి గ్రామానికి చెందిన బిక్కిన శేషగిరిరావు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్ని పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, పాంద్రంగి రాంబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, కంటే రామారావు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ సత్యప్రభకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 59 గిరిజన గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని అసెంబ్లీలో కోరిన ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభకు ఆదివాసీ యూనియన్ విద్యార్థి సంఘం నాయకులు పి.వరహాలు సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన గ్రామాలన్నింటినీ కలిపి పెద్ద మల్లాపురం కేంద్రంగా మండలంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పరమట హరీష్ (ఫైల్)

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం వన్నె చింతలపూడి గ్రామ అంబేద్కర్ నగర్‌కి చెందిన పరమట హరీష్ 12 రోజులుగా కనపడలేదు. ఈ మేరకు సోమవారం అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అన్ని ప్రాంతాలలో కుటుంబ సభ్యులు హరీష్ ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఇంటినుంచి వెళ్లిపోయినప్పుడు తను సిమెంట్ కలర్ షర్ట్, లైట్ బ్లూ ఫాంట్ ధరించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆచూకీ తెలియజేయదలిచినవారు అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించాగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. హరీష్ ఆచూకీ తెలిస్తే 9676724414, 9133744953, 9652330933 ఈ నెంబర్లకు సమాచారం తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. సీతానగరం గ్రామానికి చెందిన పెంటా అప్పారావు (61) కోరుకొండ మండలం నుంచి వస్తూ మార్గమధ్యంలో కోటి గ్రామ శివారులో చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులకు విషయం తెలిసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ సుపత్రికి కోరుకొండ పోలీసులు తరలించారు.

దాడి కేసులో యువకునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

మునికూడలి గ్రామానికి చెందిన నరుకుర్తి రామలక్ష్మి, ఆమె భర్తపై దాడి చేసిన కేసులో నిందితుడు ఉండిగుమిల్లి ప్రసాద్‌కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ రాజమండ్రి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 21న అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. మునికూడలికి ప్రసాద్, అదే గ్రామానికి చెందిన రామలక్ష్మి, ఆమె భర్తతో దురుసుగా ప్రవర్తించడమే కాక వారిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో నిందితుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి-రాజమండ్రి జాతీయ రహదారిపై సోమవారం రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒక ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. అతనిని ఆసుపత్రి తరలించారు. యర్నగూడెం వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుండి మరో లారీ ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి గాయపడ్డాడు మండలంలోని దుద్దుకూరు వద్ద హైదరాబాదు నుంచి రాజమండ్రి దానిమ్మ కాయల లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో పడింది. వ్యాన్‌లో డ్రైవరుతో పాటు మరొక వ్యక్తి ఉన్నాడు. వారు సురక్షితంగా బయటపడ్డారు ఈ సంఘటనతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

పుట్టినరోజు వేడుకలకు డెకరేషన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొమటికుంటలో సోమవారం చోటు చేసుకుంది. కరిచర్లగూడెంకు చెందిన సింగలూరి వీరబాబు (19) కుటుంబ పోషణ కోసం కూలి పనులు చేస్తుంటాడు. కొమటికుంటలో పుట్టినరోజు వేడుకలకు సంబంధించి డెకరేషన్ చేసేందుకు వెళ్లాడు. డెకరేషన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుకు గురై మృతి చెందాడు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు అకాల మృత్యువాత పడడంతో తల్లి, సోదరుడు కన్నీరుమున్నీరుగా విలపించారు.

సారా విక్రయాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. సోమవారం చేసిన నాటు సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని నందిగూడెం గ్రామ శివారు కొండపై ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 2 డ్రమ్ములలో నిల్వ ఉంచిన సుమారు 400 లీటర్ల బెల్లపు ఊట, తయారీ కేంద్రాన్ని పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ఇసుక రవాణాలో రూ.30 లక్షల మోసం

ప్రజాశక్తి - కొవ్వూరు

కుమారదేవం ఇసుక స్టాక్ పాయింట్ నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇసుక సరఫరా చేసిన గుడపాటి రాజశేఖర్ అనే వ్యక్తిని మోసగించి సుమారు రూ.30 లక్షలు కాజేసినట్లు సోమవారం ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. రాజశేఖర్ కుమారదేవం ఓపెన్ శాండ్ రీచ్ నుంచి ఇసుకను స్టాక్ పాయింట్ ద్వారా ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్‌కు సరఫరా చేస్తున్నారు. స్టాక్ పాయింట్ వద్ద భీమవరం పట్టణానికి చెందిన కునుపూడి శ్రీనివాస్ గుమస్తాగా పని చేస్తున్నాడు. ఆయన అల్లుడైన పంపన గణపతిని రాజశేఖర్‌కు పరిచయం చేశారు. లారీ ఉండని చెప్పి గణపతికి ఇసుక రవాణా పని అప్పగించారు. ప్రతిరోజూ స్టాక్ పాయింట్‌కు సాయంత్రం 6 గంటలకు మూసివేసిన తర్వాత శ్రీనివాస్ అతని అల్లుడు సుమారు రూ.6,47,881.92 విలువైన 196 ట్రిప్పుల ఇసుకను తరలించుకుపోయారని రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. ఇసుక రవాణా చేస్తూనే గణపతి మరో రూ.8 లక్షలు అడ్వాన్సుగా, కుటుంబ అవసరాల నిమిత్తం లారీని అగ్రిమెంట్ చేసుకుని రూ.15 లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.30 లక్షల వరకూ మోసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు ప్రజల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద పిహెచ్‌సి ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను మర్రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సునీతమేర్సీ మాట్లాడుతూ మండలంలోని తాటిపర్తి, వనపూడి, కొడవలి, చిన్న జగ్గంపేట గ్రామాల్లో అక్టోబర్ రెండు వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరంలో కాకినాడ జిజిహెచ్‌కు చెందిన చిన్నపిల్లల స్పెషలిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇవన్‌తేజ, జనరల్ మెడిసిన్ వైద్యులు కె.స్నేహాల్, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అమృతరావు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బన చిట్టిబాబు, సూరిచెట్టి జయకృష్ణ, బలిరెడ్డి గంగబాబు, వినుకొండ అమ్మాజీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **కాజులూరు** గొల్లపాలెం, దుగ్గుదురు పిహెచ్‌సిల పరిధిలోని పెనుమళ్ల, దుగ్గుదురు, పెదలంక గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా పిహెచ్‌సిల వైద్యులు సుప్రియ, సౌజన్య, రవితేజ, స్వాతి ఈ శిబిరాల్లో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు సూరంపూడి సుబ్బలక్ష్మి, పోతు వెంకటలక్ష్మి, చెరుపాటి పార్వతి, కాజులూరు డిసి లకాని కృష్ణచైతన్య, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని బలరామపురంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ హెచ్‌ఎం బి.ధర్మరాజు, ఆల్ ఇండియా... ప్రైస్ సర్పంచ్ సీత, ఎంపిటిసి సభ్యులు శ్రీసోమరౌతు రవి, మహారాణి సత్రం ఛైర్మన్ శ్రీసోమరౌతు చంద్రమౌళి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పైలాసాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ సౌందర్య, డాక్టర్ పృథ్వీ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజులూరులో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

గొల్లప్రోలులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గోవిందపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కమ్మెల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తూనే గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.38 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్.అప్పలరాజు, పైడిపాల సూరిబాబు, బుర్ర సత్తిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లిరాజు, నీలం శ్రీను, పాండ్రంగి రాంబాబు, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, పంచాయతీ సెక్రెటరీ, ఎపిఒ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జ్యోతుల నవీన్

మొక్కలు నాటడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించడం అందరి బాధ్యత అని సోషల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బిఎస్.పద్మజ అన్నారు. సోమవారం ఆదిత్య మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నగరపాలక ప్రాథమిక పాఠశాల, దుమ్ములపేటలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పచ్చదనం పెంపొందించడం వలన వాతావరణ సమతుల్యత కాపాడబడుతుందని కాకుండా భవిష్యత్తు తరాలకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కరుణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.ధర్మరాజు, ఆల్ ఇండియా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కిషోర్‌కుమార్, ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్ పి.సురేఖదేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సత్యవతి, చిన్నబాబు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

రాజోలు టిడిపి ఇన్‌ఛార్జిగా అమూల్య

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు టిడిపి ఇన్‌ఛార్జ్ విషయంలో కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. టిడిపి అధినేత నారా చంద్రబాబు ఆదేశాల మేరకు రాజోలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా గొల్లపల్లి అమూల్యను సోమవారం నియ మించినట్లు ఉత్తర్వులు అందాయి. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు టిడిపి నుంచి వైసిపికి మారిన తర్వాత నియోజకవర్గ బాధ్యతల్ని ఎవరికీ అప్పగించలేదు. దీంతో అందరూ ఇన్‌ఛార్జి పదవి కోసం పోటీ పడ్డారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా రాజోలు టిడిపి ఇన్‌ఛార్జి పదవిని గొల్లపల్లి అమూల్యకు ఇవ్వడంపై అభిప్రాయ సేకరణ జరిగింది. ఇందులో 70 శాతం అంగీకరించినట్లు రిపోర్ట్‌లో తెలింది. దీంతో అమెకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నూతన ఇన్‌ఛార్జి అమూల్య మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో స్థానిక ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ తో కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టిడిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి సుభాష్, ఎంపి హరీష్ మాధుర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముందే చెప్పిన ప్రజాశక్తి..!

రాజోలు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి గొల్లపల్లి అమూల్యకు ఖరారు చేస్తున్నట్లు పది రోజుల క్రితమే ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది.

ఒకేషనల్ విద్యతో అదనపు ప్రయోజనాలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఒకేషనల్ విద్యతో అదనపు ప్రయోజనాలు పొందవచ్చునని అచ్యుతాపురత్రయపురంలోని పిఎంశ్రీ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక సచివాలయంలో ఐటీ ట్రేడ్, ఆటోమోటివ్ విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ టీచర్లు జి.జ్యోతి, వై. యామిని ఆధ్వర్యంలో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ ఎడ్యుకేషన్ స్థానికంగా అందుబాటులో ఉందని, తద్వారా విద్యార్థులకు రెగ్యులర్ కోర్స్‌తో పాటు ఐటి ట్రేడ్, ఆటోమోటివ్ ట్రేడ్‌లలో విద్యార్థులకు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. వృత్తి విద్యతో విద్యార్థులు అదనపు ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కవులు, కళాకారులను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సమాజ నిర్దేశకులైన కవులు, కళాకారులను యువత ఆదర్శంగా తీసుకోని ముందుకు నడవాలని తెలుగు పండితులు మరియు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత డాక్టర్ పుణ్యమంతుల అర్జున రావు అన్నారు. సమాజాన్ని చైతన్యపరిచి, జాగ్రుతం చేయడం లో కవులు, కళాకారుల పాత్ర ఎనలేనిదని ఆయన అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం శివరావు అధ్యక్షతన కళా సాహితీ 19వ వార్షికోత్సవ వేడుకలు శివరావు అధ్యక్షతన జరి గాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అర్జునరావు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రసిద్ధి చెందిన కవుల జీవితాల పై అనర్గళంగా ప్రసంగించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పి వి.ఎన్.వర్మ, కోశాధికారి పి.విజయ్‌కుమార్, గౌరవాధ్యక్షులు విత్తనాల వరప్రసాద రావు, ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనిరసాన్, సంస్థ పూర్వ ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాసరావు, ఎవియస్, భాస్కరవర్మ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై దసరా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - శంఖవరం, సామర్లకోట

అన్నవరం రత్నగిరిపై దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఇట వీధ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారి ప్రధానాలయంలో మూల వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే సామర్లకోట భీమేశ్వరాలయంతోపాటు, పలు దేవాలయాల వద్ద దసర ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి.


రత్నగిరిపై అమ్మవారిని పూలతో అలంకరణ

లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - మామిడికుదురు

మార్కెట్ కమిటీ నిధులతో లింకు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పెసమాల లక్ష్మి అన్నారు నగరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆమె అధ్యక్షత వహించారు. సభ్యుల నుంచి లింక్ రోడ్ల ప్రతిపాదనలు స్థానిక ఎం ఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ఉచిత పశు వైద్య శిబి రాలు నిర్వహణ, తదితర అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో రూ.22 లక్షల ఆదాయం వచ్చిందని ఇన్‌ఛార్జ్ కార్యదర్శి జి.ప్రదీప్ తెలిపారు సమావేశంలో వైస్ చైర్మన్ గుడాల వెంకట రమణ, నూకల వీరేశ్వర రావు, పెంట ఏసుకుమారి, సర్పంచ్ జాలెం రమణకుమారి, చిట్టాల రామ జోగేశ్వరరావు, కుంపట్ల మల్లికార్జున రావు,లూటుకుర్తి సత్యనారాయణ, పినిసెట్టి రామచంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

10 గంటల పని దినం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఏపి రాష్ట్ర అసెంబ్లీలో ఇంతవరకు రాష్ట్రంలో అమలులో ఉన్న 8 గంటల పనిదినాన్ని 10 గంటల పనిదినంగా మారుస్తూ నిర్ణయం చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సోమవారం అమలాపురం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే శుక్రవారం అసెంబ్లీలో 8 గంటల పనిదినాన్ని 10 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కార్మిక, ఉద్యోగ వర్గాలు పోరాడటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 1920వ సంవత్సరంలో స్వతంత్ర పోరాటంలో, భాగంగా 8 గంటల పనిదినం కోసం నినాదాన్ని గాంధీ మహాత్ముడితో పాటు వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. దానికి అను గుణంగానే అప్పటి నుండి ఎనిమిది గంటల పని దినం మన దేశంలో అమలు జరుగుతుందని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత 1948లో ఫాక్టరీ చట్టం దేశంలో అమలు ప్రారంభమైనప్పటి నుంచి 8 గంటల పనిదినం అనేది దేశంలో అమలు జరుగుతుంది. అంతటి చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని ఈరోజు తుంగలో తొక్కడం అత్యంత హేయ మైన చర్య అని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహం అయ్యాయి అనటానికి ఇదే ఉదాహరణ అని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటలకు పని దినాన్ని 10 గంటల పనిదినంగా మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. లేనియెడల ఈ సమ స్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతా మని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిల్డింగ్ జిల్లా అధ్యక్షులు వి.మోహనరావు, అంగన్వాడీ జిల్లా కోశాధికారి అమ్మాల్ల వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పోలీసుల కస్టడీ నుంచి ఖైదీ పరార్

ప్రజాశక్తి - దేవరపల్లి

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఖైదీ బత్తుల ప్రభాకర్ సోమవారం సాయంత్రం పోలీసుల కస్టడీ నుండి పరారయ్యాడు. ప్రభాకర్‌ను కోర్టు వాయిదా నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లి తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తీసుకువస్తుండగా దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద తప్పించుకున్నాడు. పారిపోయిన సమయంలో చేతికి హ్యాండ్‌కఫ్స్ ఒకప్పుడు ఉండగా, అతను వైట్ టీ షర్ట్, బ్లాక్ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఎస్‌పి కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించారు. అనంతరం వారితో ముఖాముఖి మాట్లాడివారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 19 మంది అర్జీదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.

26, 27 తేదీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - మామిడికుదురు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26, 27 తేదీలలో సర్పంచ్‌లకు మరియు పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ లు, కార్యదర్శులు ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో తప్పక హాజరు కావాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ముమ్మిడివరం ఎస్ఐ డి జ్వాలా సాగర్ పిలుపునిచ్చారు. గేదెల్లంక గ్రామంలో సోమవారం గ్రామ సచివాలయం వద్ద మహిళా సంరక్షణ కార్యదర్శి కె.నాగసుధ ఆధ్వర్యంలో జరిగిన మత్తు పదార్థాలపై అవగాహనా ర్యాలీని ఎస్ఐ జ్వాలా సాగర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో గుద్దటి నాయుడు, నిమ్మన బాలకృష్ణ, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి రాహుల్‌మీనా

అంగీకార-2025 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

పిఎం ఆవాస్ యోజన -అర్బన్ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే నిమిత్తం అంగీకార-2025 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో హౌసింగ్ అధికారులతో కలిసి అంగీకార-2025 పోస్టర్‌ను జెసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగీకార-2025 కార్యక్రమం జిల్లాలో ఈ నెల 4 నుంచి అక్టోబర్ 31 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిఎంఎవై-అర్బన్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రయోజనాలు, పిఎం సూర్యఘర్, నిర్మాణ పనులు పూర్తైన ఇండ్లకు గృహ ప్రవేశాలు చేసి ప్రారంభించడం వంటి ఇతర సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ అవగాహనా కార్యక్రమాల్లో ప్రజలు, లబ్ధిదారులు పెద్దఎత్తున పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. తద్వారా ఆయా పథకాలను వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్.వి.వి. సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, BONDALA NAGA VEERA DURGA PRASAD, S/o. Bondala Ramakrishna, D.No. 20-746, Yerra Konda, Dowlaiswaram, E.G. District, A.P., Pin: 533125, I have changed my name from **BONDALA DURGA PRASAD** (Old Name) to **BONDALA NAGA VEERA DURGA PRASAD** (New Name). Hence forth Iam being called **BONDALA NAGA VEERA DURGA PRASAD**, S/o. Bondala Ramakrishna, for all purpose.

సర్టిఫికేట్స్ పోయినవి

కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, అల్లిపూడి గ్రామానికి చెందిన పెదపాత్రుని హరీష్, S/o. పెదపాత్రుని రామకృష్ణ అను నేను మా గ్రామం అల్లిపూడి నుండి కోటనందూరు బైక్‌పై వెళ్తుతుండగా మార్గం మధ్యలో నా యొక్క పదవ తరగతి మరియు ఇంటర్ సర్టిఫికెట్స్ పడిపోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు అందజేయగలరు.

పెదపాత్రుని హరీష్
S/o. రామకృష్ణ
రైస్‌మిల్లు వెనకాల, అల్లిపూడి గ్రామం, కోటనందూరు మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9705844182

ఒరిజినల్ దస్తావేజు పోయినది

నా క్లయింటు రాజమహేంద్రవరం, మెరక వీధి, డోర్ నెం. 32-10-19 కాపురస్తుడు **లేటు గుండు మల్లేశ్వరరావు గారి కుమార్తె గుండు వెంకటరావు గారికి** ఇచ్చిన సంజాయిషీపై ఈ ప్రకటన జారీ చేయడమైనది. నా క్లయింటు తన ఇంటి వద్ద నుండి తన డోర్ నెం. 32-10-19 SRO, రాజమండ్రి తాలుకు **రిజిస్టర్డు దస్తావేజు నెం. 2349/1997, తేది. 30-4-1997** ను తన టూ వీలర్ మోటార్ వాహనంపై **దీ. 18-09-2025 సం॥ము తేదీన ఉదయం సుమారు 11 గం॥ల** కలెక్టరాఫీస్ తీయు నిమిత్తం దేవీచౌక్, రామాలయం జెరాక్స్ షాపు వద్దకు వెళుతూ మార్గంమధ్యలో పడిపోయినది. ఎంత వెదకినా నా క్లయింటుకు దొరకలేదు. కావున ఈ ప్రకటన వెలువడిన రెండు రోజులలోగా నా క్లయింటుకు సదరు దస్తావేజు అందచేసిన తగిన బహుమతిని పొందగలరు. తదుపరి క్లయిమ్‌లు చెల్లవు.

నా క్లయింటు సెల్ నెం:9949375629

అల్లంకి రఘురామ్, అడ్వకేట్
పెద్ద వీధి, జాంపేట రాజమహేంద్రవరం, సెల్: 9247465589

In the court of the Hon'ble Civil Judge Senior Division, Amalapuram
I. P. No. 22 of 2025

Between:
Remella Srinivasa Visweswara Rao, S/o Gangadghara Ramarao, D.No. 10-1-42, Brahmmanandam Street, Moberlipeta, Amalapuram. ...**Petitioner**

Vs

1. Reddy Satyanarayana, Slo. Satyanarayana Murthy, D.No.3-3-7/1, Near Ramalayam, Narayanapeta, Amalapuram - 533 201.
2. Bandaru Bala Prasad, S/o. Nageswara Rao, 2-32-2, Sankuru Village, Amalapuram Rural Mandal.
3. Yalla Trimurthulu, S/o. Veerraju, D No 1-106, Saibaba temple Area, Uppumilli Village, Kajuluru Mandal, Kakinada Dist
4. Gandrothu Venkataramana, W/o. Srinivasa Rao, D.No. 2-76-2, Sakurru Village, Amalapuram Rural Mandal. **...Respondents**

A petition filed by the petitioner U/S 9 & 13 of the Provincial insolvency Act, 1920 praying the Hon'ble Court to declare the 1st respondent as insolvent to annul and cancel the registered Sale Deed Dt 28-06-2025 Doc No 5673 of 2025 executed by 1st respondent for item No 1 of petition B schedule property and also Regd Sale Deed dt 28-6-2025 Doc No 5674 of 2025 in favour of 3rd Respondent covered item No 2 of B schedule property and also Regd Sale Deed dt 28-6-2025 Doct No 5675 of 2025 registered in SRO, Amalapuram in favor of 4th respondent covered under item No 3 of B schedule property and other reliefs and the matter is posted to 07-10- 2025 The respondents and objectors if any are hereby required to appear before this Hon'ble Court from **10.30 AM onwards on 07-10- 2025** and file their objections if any, otherwise matter will be decided in favour of the petitioner.

(By court order)

Sri Makireddi Adinarayana Rao,
Amalapuram, Advocate, Vidyut Nagar,
Dt: 19-09-2025, Amalapuram, Cell: 98480 59496

PASSPORT MISSING

I, Perumalla Srinivas, S/o Nageswara Rao, D.No.3-19, Near Vinayaka Temple, Sankarapuram, Nidadavole Mandal, East Godavari District, I lost my **Passport No.P2272337** while traveling from My Bus Stand, Nidadavole. If any one found please call: **96662 93001.**

పురపాలక సంఘ కార్యాలయం, తుని

ఆర్.ఒ.సి. 63/2000-ఎ2 తేది. 22-09-2025

బహిరంగ వేలము నోటీసు

తుని పురపాలక సంఘ ఆధీనములో గల జి.ఎన్.టి. రోడ్డు యందు ఎస్.ఆర్.కె. షాపింగ్ కాంప్లెక్సులో గల షాపు నెం. 01 నుండి 021 వరకు గల షాపు రూములు మరియు శ్రీనివాస థియేటర్ ఎదురుగా గల మున్సిపల్ షాపు నెం. 108 నుండి 113 వరకు, 115 నుండి 122 వరకు, మరియు గడ్డి మార్కెట్ యందు 85 నుండి 92 వరకు గల షాపులు గరిష్ఠ లీజు కాలపరిమితి 25 సం॥లు పూర్తి అయినందున సదరు షాపులు లీజు పొందు హక్కు కొరకు షాపు రూములను తేది. 24-09-2025 ఉదయం గం॥ 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడును.

ఇతర వివరములు కొరకు మున్సిపల్ రెవెన్యూ అధికారి / రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వార్డను గాని లేదా సంబంధిత గుమాస్తా వారిని గాని కార్యాలయ పని వేళల యందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- **కమీషనరు, తుని పురపాలక సంఘం**